సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



మార్చి 13 నుంచి రైళ్ల వేగం పెంపు

గూడూరు- హైదరాబాద్ మధ్య తిరిగే సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేగాన్ని మార్చి 13వ తేదీ నుంచి పెంచనున్నారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,800
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,252
3 శాతం జీఎస్టీతో	రూ.5,410
సవర (8 గ్రా)	రూ.43,280

గరిష్టం/కనిష్టం
29.9 /23.2

వాతావరణం

బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ప్రభావంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. గాలిలో తేమ 75 శాతం ఉంది.

పర్యాటక కొలనులు

నాడు-నేడు కింద రూ.70 కోట్లతో చెరువుల అభివృద్ధి

- పైలట్ ప్రాజెక్ట్‌గా 47 చెరువుల ఎంపిక
- చెరువు కట్టలపై వాకింగ్ ట్రాక్, లైటింగ్, గార్డెన్స్
- ఇప్పటికే 50 శాతానికిపైగా పనులు పూర్తి

ఊరికి పక్కనే ఉన్న చెరువులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రప్రథమంగా పైలట్ ప్రాజెక్ట్‌గా చెరువుల రూపురేఖలు మారుస్తున్నారు. గ్రామీణులు ఉదయసంధ్య వేళల్లో వాకింగ్ చేయడానికి అనువుగా ట్రాక్, మనసును ఉల్లాసపరిచే రీతిలో పచ్చదనం ఉట్టిపడేలా గార్డెన్స్, విశ్రాంతి తీసుకునేందుకు బల్లలు, లైటింగ్ వంటి వసతులతో నాడు-నేడు పథకం కింద 'గ్రామ కొలనులు'గా చెరువులను అభివృద్ధి చేయనున్నారు.

నెల్లూరు (పొగతోట): ఉమ్మడి జిల్లాలో నాడు-నేడు ద్వారా రూ.70 కోట్లతో 47 చెరువులను పూర్తిస్థాయిలో గ్రామ కొలనులుగా అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. పార్కులను తలపించే రీతిలో చెరువు కట్టలను విస్తరించి రూపురేఖలు మార్చనున్నారు. 2021లో కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసి అనుమతి తీసుకున్నారు. పైలట్ ప్రాజెక్ట్‌గా మండలానికి ఒక్క చెరువు చొప్పున 47 చెరువులను ఎంపిక చేశారు. మొదటి సారిగా జిల్లాలో నాడు-నేడు ద్వారా గ్రామ కొలనులు అమలుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతానికి 50 శాతం మేర పనులు పూర్తయ్యాయి. చరిత్రాత్మక కట్టడాలు ఉన్న ఉదయగిరి మండలంలో రెండు చెరువులు, మిగిలిన మండలాల్లో ఒక్కొక్క చెరువును ఎంపిక చేసి అభివృద్ధి పరుస్తున్నారు.



నమూనా



డీసీపల్లి చెరువు కట్టపై జరుగుతున్న ట్రాక్ నిర్మాణం



మర్రిపాడు మండలం డీసీపల్లిలో జరుగుతున్న చెరువు అభివృద్ధి పనులు

నమూనా



ఉపాధి కూలీలకు పనుల కల్పన

రూ.70 కోట్లతో చేపడుతున్న చెరువుల అభివృద్ధి ద్వారా ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తున్నారు. ఇందులో రూ.64 కోట్లు మెటీరియల్ పనులు ఉండడంతో టెండర్ ప్రక్రియ ద్వారా చేపడుతున్నారు. మిగతా రూ.6 కోట్ల పనులను ఉపాధి హామీ కూలీల ద్వారా నిర్వహిస్తున్నారు. పనుల పర్యవేక్షణకు గ్రామ సచివాలయంలో ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఉపాధి హామీ ఈసీ, ఇరిగేషన్ ఏఈలను నియమించారు. ఎంపీడీఓల ఆధ్వర్యంలో పనులు పూర్తి చేయాల్సి ఉంది.

ఆహ్లాదకర వాతావరణం

గ్రామ కొలనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు సాగు, తాగు నీరుతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడనుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రజలు సేద తీరడానికి, వాకింగ్‌కు అనువుగా చెరువు కట్టలను విశాలంగా విస్తరించి అటూఇటూ రైలింగ్ ఏర్పాటు చేసి చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులతో కూడిన చిన్న చిన్న గార్డెన్స్, బెంచీలు, మధ్యలో వాకింగ్ ట్రాక్‌లు, విద్యుత్ వెలుగులు, తాగునీటి వసతులు ఏర్పాటు చేస్తున్నారు.

అనేక ప్రయోజనాలు

గ్రామ కొలనుల పేరుతో చేపడుతున్న చెరువుల అభివృద్ధి లక్ష్యంతో అనేక ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయి. ప్రధానంగా చెరువుల్లో ఆక్రమణలు తొలగించడంతో పాటు తాగు, సాగునీరు పుష్కలంగా అందించేందుకు వీలు ఏర్పడుతోంది. తద్వారా చెరువు కట్టలు పటిష్టం అయ్యే అవకాశం ఉంది. పార్కులను తలపించే రీతిలో అభివృద్ధి పనులతో చెరువు పరిసరాలు పరిశుభ్రంగా పర్యాటకంగా రూపుమారుతాయి. గ్రామ కొలనుల పనులు పూర్తయితే సుమారు 22 వేల ఎకరాలు అదనంగా సాగులోకి వచ్చే అవకాశం ఉంది.

మినీపార్కులుగా గ్రామకొలనులు



గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను మినీ పార్కులుగా గ్రామ కొలనులను తీర్చిదిద్దుతున్నాం. మారుతున్న ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ వ్యాయామం అవసరం. గ్రామాల్లో వ్యాయామానికి అవసరమైన వాకింగ్ ట్రాక్‌లు కానీ, ఇతర వ్యాయామ ఉపకరణాలు కానీ అందుబాటులో ఉండవు. చెరువు పరిసరాలను మినీ గార్డెన్స్‌గా అభివృద్ధి చేయడం ద్వారా వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామానికి అనువైన ఉపకరణాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో సేద తీరడానికి, కాసేపు కబుర్లు చెప్పుకోవడానికి అనుకూలంగా గార్డెన్స్ మధ్యలో బెంచీలు, లైటింగ్, తాగునీటి వసతులు కల్పిస్తున్నాం. జిల్లాలో ఈ తరహా గ్రామ కొలనులు నాడు నేడు కార్యక్రమం ద్వారా చేపడుతున్నాం. నాణ్యతా లోపం లేకుండా పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

– కేవీఎన్ చక్రధర్‌బాబు, కలెక్టర్

న్యూస్‌రీల్

నేటి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక

- జిల్లాలో 3.12 లక్షల మందికి రూ.86.71 కోట్ల పంపిణీ

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీకి అవసరమైన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. 1వ తేదీ తెల్లవారుజాము నుంచి లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక అందజేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,12,222 మంది లబ్ధిదారులకు రూ.86,71,07,750 నగదును వలంటీర్లు తెల్లవారుజామునే అవ్వా తాతల ఇంటి తలుపులు తట్టి అందించనున్నారు. దీనికి సంబంధించి ఆయా సచివాలయ పరిధిలోని వలంటీర్లకు నగదును అందించారు.

డిగ్రీ పరీక్షల్లో తొమ్మిది మంది డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో తొమ్మిది మంది విద్యార్థులు డిబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదో సెమిస్టర్‌లో 1,371 మంది విద్యార్థులకు గాను 143 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నెల్లూరు నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నెల్లూరు నగరంలోని చంద్రారెడ్డి డిగ్రీ కళాశాల, వీఆర్ ఐఏఎస్ డిగ్రీ కళాశాలలో ఒక్కో విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్‌లో 4,069 మంది విద్యార్థులకు గాను 305 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నెల్లూరు నగరంలోని జగన్స్ డిగ్రీ కళాశాల, నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విడవలూరులోని పీఆర్‌ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఒక్కో విద్యార్థి డిబార్ అయ్యారని వివరించారు.

పరివర్తన ద్వారా నాటుసారా రహిత జిల్లా


- కలెక్టర్ చక్రధర్‌బాబు



రూ.17 లక్షల మెగా నమూనా చెక్కును అందించిన కలెక్టర్ తదితరులు

నెల్లూరు (అర్బన్): పరివర్తన 2.0 కార్యక్రమం ద్వారా నాటుసారా తయారీ రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పోలీసులు, అధికారులు కృషి చేస్తున్నారని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో నాటుసారా తయారు చేస్తున్న 17 కుటుంబాలను పరివర్తన 2.0 ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి వారిని సాధారణ పౌరులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేశారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో 17 కుటుంబాల వారికి ప్రత్యామ్నాయ ఉపాధి పనులు చేసుకునేందుకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.17 లక్షల మెగా నమూనా చెక్కును కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో పోలీసులు జిల్లాలో నాటుసారా తయారీదారులను గుర్తించి వారిని మార్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇలా మారిన వారికి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఈ రుణాలతో మేకలు, గొర్రెలు పెంపకం, చిన్న తరహా వ్యాపారాలు చేసుకునేలా తద్వారా గౌరవ జీవితాన్ని గడిపేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లాలో నాటుసారా తయారీదారులు ఇకనైనా మారి ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెబ్ అధికారి శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి, సెబ్ అధికారులు రవికుమార్, కృష్ణకిశోర్‌రెడ్డి, శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ సిబ్బంది మస్తాన్, నాగమణి పాల్గొన్నారు.

సోమశిలలో 69.110 టీఎంసీలు



సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 69.110 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 1,490 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వస్తోంది. జలాశయం నుంచి పెన్నార్‌డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 653, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. నగటున 331 క్యూసెక్కులు ఆవిరవుతోంది.

హేచరీలకు అనుమతులు తప్పనిసరి



హేచరీలో సీడ్ ఉత్పత్తికి అవసరమైన మౌలిక వసతులను అడిగి తెలుసుకుంటున్న సీఏఏ చైర్మన్ కృప

- సీఏఏ చైర్మన్ కృప

బుచ్చిరెడ్డిపాళెం (విడవలూరు): రొయ్య పిల్లలు ఉత్పత్తి చేసే హేచరీలకు తప్పని సరిగా అనుమతులు ఉండాలని చెన్నై కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సీఏఏ) చైర్మన్ కృప సూచించారు. మండలంలోని రామచంద్రాపురంలో ఉన్న వాటర్‌బేస్ హేచరీని మంగళవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేస్తున్న వాటర్‌బేస్ హేచరీ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవడంతో తనిఖీ చేశామన్నారు. సీడ్ ఉత్పత్తి విషయంలో నాణ్యత పాటించాలని చెప్పారు. నాణ్యత లేని సీడ్‌ను ఉత్పత్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బ్రూడర్లు (తల్లి రొయ్యలు) ఎక్కడ నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఎంత సీడ్ ఉత్పత్తి లక్ష్యం అనే విషయాలతో సీడ్ ఉత్పత్తికి అనుకూలమైన వసతులను కూడా పరిశీలించామన్నారు. ముఖ్యంగా అనుమతులు లేకుండా హేచరీలను ఏర్పాటు చేసుకున్నా, నాణ్యమైన సీడ్‌ను ఉత్పత్తి చేయకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట విజయవాడ ఎంపెడా (మెరైన్ ప్రొడక్ట్, ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ) డీడీ శివరాజన్, సీఏఏ అధికారి రమేష్ రాథోడ్, కావలి మత్స్యశాఖ ఏడీ శ్రీను, సచివాలయ మత్స్యశాఖ సహాయ అధికారి సహన్ ఉన్నారు.

నేటి నుంచి ఉచితంగా బియ్యం పంపిణీ

నెల్లూరు (అర్బన్): జిల్లాలోని 7,22,278 కార్డుదారులకు 438 చౌకదుకాణాల ద్వారా బుధవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని డీఎస్ఓ టి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం కార్డులోని సభ్యుల్లో ఒక్కొక్కరికి 5 కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేస్తామన్నారు. కిలో కందిపప్పు రూ.67లకు, అర కిలో పంచదార రూ.17 చొప్పున అందిస్తామన్నారు. అంత్యోదయ, అన్నయోజన కార్డుకు 35 కిలోల చొప్పున బియ్యం ఉచితం. కిలో కందిపప్పు రూ.67లకు, ఒక కిలో పంచదార రూ 13.50 చొప్పున ఇళ్ల వద్దకే వచ్చి పంపిణీ చేయనున్నారు. ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటలకు వరకు రేషన్ సరుకులు అందిస్తామన్నారు. తమకు కేటాయించిన నిత్యావసర సరుకులను ఎవరైనా దుర్వినియోగం చేస్తే వారి కార్డులను రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉగాది నాటికి జగనన్న ఇళ్ల ప్రవేశాలు

- కలెక్టర్ చక్రధర్‌బాబు



వెంకటేశ్వరపురంలోని జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తదితరులు

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు నిర్మిస్తున్న జగనన్న ఇళ్లు ఉగాది నాటికి పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు హౌసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చక్రధర్‌బాబు నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, అధికారులతో కలిసి వెంకటేశ్వరపురంలో జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పురోగతిని తనిఖీ చేశారు. ఇక్కడ లే అవుట్‌లో 769 ఇళ్లు మంజూరు చేశామని హౌసింగ్ అధికారులు తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. వేగం పెంచి ఉగాది నాటికి లక్ష్యం మేరకు ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. రోజు వారి లక్ష్యాలను నిర్దేశించుకుని నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు తమకు నివేదిక పంపాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలతో పాటు జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం రూరల్ పరిధిలోని అక్కచెరువుపాడు వద్ద ఉన్న లేఅవుట్లలో నిర్మితమవుతున్న జగనన్న ఇళ్లను పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ హరిత, ఆర్డీఓ మలోల, హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వెంకటదాసు, ఇంజినీర్లు, అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎస్పీఎల్.. ఆట ప్రారంభం

SPL SAKSHI PREMIER LEAGUE

Regional sponsor
APMDC | APMDC FOUNDATION



సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న డీఎస్ఏ సీఈఓ పుల్లయ్య



తలపడుతున్న గీతాంజలి, ఆదిశంకర జట్లు

- ఘనంగా సాక్షి ప్రీమియర్ లీగ్ మొదలు
- మ్యాచ్‌లను ప్రారంభించిన డీఎస్ఏ సీఈఓ పులయ్య
- క్రీడలను ప్రోత్సహిస్తున్న సాక్షికి అధికారుల ప్రశంసలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఔత్సాహిక క్రీడాకారులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) క్రికెట్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ప్రధాన క్రీడా ప్రాంగణంలో మంగళవారం పోటీలు మొదలయ్యాయి. సెట్నల్, డీఎస్ఏ సీఈఓ డి.పుల్లయ్య, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఆర్కే ఎతిరాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోటీలను ప్రారంభిస్తూ సీఈఓ పుల్లయ్య మాట్లాడుతూ క్రీడలను సాక్షి యాజమాన్యం ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కరోనా తర్వాత క్రీడలపై సన్నగిల్లిన ఆసక్తిని పెంపొందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాల వల్ల క్రీడాపోటీలు జరుగుతున్నాయన్నారు. ఆటల కోసం కాకుండా నిరంతరం క్రీడాకారులు మైదానాల్లో గడపాలన్నారు. చీఫ్ కోచ్ ఆర్కే ఎతిరాజ్ మాట్లాడుతూ గెలుపు, ఓటములతో నిమిత్తం లేకుండా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలన్నారు. సాక్షి యాజమాన్యం ప్రతి ఏడాది క్రీడాకారులను ప్రోత్సహించడం క్రీడా ప్రాముఖ్యతను చాటడం విశేషమన్నారు. సాక్షి నెల్లూరు యూనిట్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జి సీహెచ్ మస్తాన్ రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి కేఎస్.శ్రీనివాసరావు, అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ జయరాజ్, సాక్షి టీవీ కరస్పాండెంట్ మధు, సాక్షి సిబ్బంది పాల్గొన్నారు.

SAKSHI
సాక్షి
SAKSHI DIGITAL
MEDIA GROUP



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పుల్లయ్య

నేడు పోటీలో తలపడే జట్లు

ఎస్పీఎల్ బుధవారం జరిగే టోర్నీలో మొదటి మ్యాచ్ నారాయణ జూనియర్ కాలేజీ, వివేకానంద కాలేజీ నెల్లూరు జట్ల మధ్య, రెండో మ్యాచ్ నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ, గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీ కోవూరు నడుమ, 3వ మ్యాచ్ నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ, విద్యానగర్ ఎన్బీకేఆర్ జట్ల మధ్య పోటీలు జరుగుతాయని సాక్షి బ్రాంచి మేనేజర్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.

తొలి రోజు విజేతలు

ఎస్పీఎల్ టోర్నీలో తొలి రోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. అంపైర్లుగా చిట్టిబాబు, వాజిద్‌లు, స్కోరర్‌గా తరుణ్ వ్యవహరించారు. తొలుత వివేకానంద, నారాయణ జూనియర్ కాలేజీ జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన నారాయణ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది.



- మొదట బ్యాటింగ్ చేపట్టిన వివేకానంద కాలేజీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 110 పరుగులు సాధించింది. తదుపరి బ్యాటింగ్ చేసిన నారాయణ జూనియర్ కాలేజీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 72 పరుగులకే పరిమితమైంది. దీంతో వివేకానంద కాలేజీ జట్టు 38 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ జట్టులో విష్ణు, కేశవ, వారిస్‌లు చెరో రెండు వికెట్లు, కరీమ్ 26 పరుగులు, వారిస్ 24 పరుగులు, కిషోర్ 18 పరుగులు చేసి విజయంలో ప్రధానపాత్ర పోషించారు.



- రెండో మ్యాచ్ ఎన్బీకేఆర్ (విద్యానగర్), పీబీఆర్‌విట్స్ (కావలి) జట్ల మధ్య సాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎన్బీకేఆర్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 79 పరుగులు సాధించింది. తదుపరి బ్యాటింగ్ చేసి పీబీఆర్ విట్స్ (కావలి) 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 58 పరుగులే చేయడంతో ఎన్బీకేఆర్ జట్టు 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఎన్బీకేఆర్ జట్టులో రమేష్ 35, క్రాంతి 23 పరుగులు, యజ్ఞేష్ 3 వికెట్లు తీసి జట్టు గెలుపునకు కృషి చేశారు.



- మూడో మ్యాచ్ ఆదిశంకర గీతాంజలి జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిశంకర జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు చేజార్చుకుని 82 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన గీతాంజలి జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 71 పరుగులకే పరిమితమైంది. దీంతో ఆదిశంకర 11 పరుగుల తేడాతో నెగ్గింది. ఆదిశంకర జట్టును నవీన్, షఫీ చెరో 12 పరుగులు చేయగా మనోజ్ రెండు వికెట్లు తీసి జట్టు విజయ తీరానికి చేర్చారు.

క్లుప్తంగా

ఈనెల 15వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

నెల్లూరు(టౌన్): ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఈనెల 15వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ఇన్‌చార్జి డీఈఓ గ్లోరి కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.25 అపరాధరుసుంతో అయితే 22వ తేదీ వరకు, రూ.50తో వచ్చేనెల 2వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. వివరాల కోసం నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పరీక్షల విభాగం అధికారులను సంప్రదించాలని సూచించారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- 30 మంది ప్రయాణికులు క్షేమం

ఉలవపాడు: లారీని వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటన మండల పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై కరేడు ర్యాంపు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీవెంకటేశ్వర ట్రావెల్స్ బస్సు 30 మంది ప్రయాణికులతో విజయవాడ నుంచి తిరుపతికి వెళ్తోంది. ముందు వెళ్తున్న లారీ బ్రేక్ వేయడంతో వెనుక వైపు నుంచి బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం దెబ్బతింది. డ్రైవర్ నరేష్‌తో సహా ప్రయాణికులంతా క్షేమంగా బయటపడ్డారు. మరో వాహనం వచ్చేవరకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అదే ట్రావెల్స్‌కు చెందిన మరో బస్సులో తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

వెంకటాచలం/నెల్లూరు(వీఆర్సీసెంటర్): యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మేఘన (14) అనే బాలిక మంగళవారం మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. చెముడుగుంట పంచాయతీ నక్కలకాలనీకి చెందిన మేఘనతో గతేడాది సెప్టెంబర్ 5వ తేదీన ఆమె మేనత్త కుమారుడైన నాగరాజు అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక ప్రతిఘటించడంతో ఆమె ముఖంపై యాసిడ్ పోసి కత్తితో గొంతు కోశాడు. బీరువాలోని నగదు, నగలు తీసుకుని నిందితుడు పరారయ్యాడు. కాగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాలతో మేఘనను మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం బాలిక మృతిచెందిందని పోలీసులు వెల్లడించారు. ఈ కేసును హత్య కేసుగా మార్చు చేసి దిశ డీఎస్పీ సురేష్‌బాబు విచారిస్తున్నారు.

ప్రజాప్రతినిధుల గన్‌మెన్లను తొలగించలేదు

- ఏఎస్పీ శ్రీనివాసరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో ప్రజాప్రతినిధుల గన్‌మెన్లను తొలగించలేదని అడిషనల్ ఎస్పీ (ఏఆర్) శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్యూరిటీ స్కేల్ ఆధారంగా జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రజాప్రతినిధుల రక్షణ కోసం గన్‌మెన్లను నియమించామన్నారు. వారు నిరంతరం విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఏ ఒక్క ప్రజాప్రతినిధికి భద్రతా సిబ్బందిని తొలగించడం జరగలేదన్నారు.

రెండు మోటార్‌బైక్‌ల ఢీ

- వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో బాలకృష్ణ

ఆత్మకూరు: రెండు మోటార్‌బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ముస్తాపురం సమీపంలో జరిగింది. ఎస్సై ఎం.శివశంకర్‌రావు కథనం మేరకు.. పొనుగోడు గ్రామానికి చెందిన బాలకృష్ణ (38) కట్టెల వ్యాపారం చేస్తుంటాడు. ఈక్రమంలో ఏఎస్‌పేట సమీపంలోని పలుచోట్ల కట్టెల కొనుగోలు గురించి మాట్లాడి ఆత్మకూరుకు బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో ఆత్మకూరు నుంచి ముస్తాపురానికి బైక్‌పై వెళ్తున్న ప్రసాద్ రాంగ్ రూట్‌లో వెళ్లి బాలకృష్ణ బైక్‌ను ఎదురుగా ఢీకొన్నాడు. దీంతో బాలకృష్ణ తలకు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రసాద్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ బాలకృష్ణ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:113
లేయర్ (లైవ్)	:80
బ్రాయిలర్ చికెన్	:200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:222
లేయర్ చికెన్	:136

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	:రూ.35
సన్నవి	:రూ.25
పండ్లు	:రూ.8

- ప్లేస్‌మెంట్స్‌లో కేఎల్ యూనివర్సిటీకి దేశంలోనే నాలుగో స్థానం
- వర్సిటీ డైరెక్టర్ (అడ్మిషన్స్) శ్రీనివాసరావు
- ఆత్మకూరులో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం
- అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- డిప్యూటీ డైరెక్టర్ (అంతర్జాతీయ అడ్మిషన్లు) షణ్ముఖ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ (అడ్మిషన్స్) శ్రీనివాసరావు



సమావేశంలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు

సరైన నిర్ణయాలతో ఉజ్వల భవిత

ఆత్మకూరు: 'సరైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. ఉత్తమ అధ్యాపకులే అత్యుత్తమ ఫలితాలు సాధించి చూపుతారు. అలాంటి ఫ్యాకల్టీ ఉన్న కళాశాలను ఎంచుకోవడం ద్వారా విద్యార్థులు తమ గమ్యాన్ని సులువుగా చేరుకోవచ్చు.' అని కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ (అడ్మిషన్స్) డాక్టర్ జె.శ్రీనివాసరావు అన్నారు. కేఎల్ యూనివర్సిటీ (డీమ్డ్) ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలోని ఏఎస్ఆర్ కాలేజ్ ఆవరణలో మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేఎల్ యూనివర్సిటీలో ఎంతో సాంకేతిక పరిజ్ఞానం మేళవించిన ప్రత్యేక కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. అదేక్రమంలో సమర్థులైన అధ్యాపకులు ఉన్నారన్నారు. ప్లేస్‌మెంట్స్ కల్పించడంలో కేఎల్ యూనివర్సిటీ దేశంలోనే నాలుగో స్థానంలో ఉందన్నారు. గత సంవత్సరం 4,650 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయంటే యూనివర్సిటీ సామర్థ్యం అర్థమవుతోందన్నారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకమైన మలుపు అని ఈ సమయంలో తీసుకునే నిర్ణయమే వారి భవిష్యత్‌కు నాంది అన్నారు. కేవలం పట్టణ పరిధిలోని విద్యార్థులకే మంచి భవిష్యత్ ఉంటుందనే అపోహ తల్లిదండ్రుల్లో ఉందన్నారు. అయితే కేఎల్ యూనివర్సిటీ గ్రామీణ స్థాయిలోని విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా ఆత్మకూరులో అవగాహన సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నంబర్-1 స్థానంలో కేఎల్ యూనివర్సిటీ ఉందన్నారు.

ప్రత్యేక శిక్షణ కేఎల్ సొంతం

వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ (అంతర్జాతీయ అడ్మిషన్లు) డాక్టర్ షణ్ముఖ్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్ అనంతరం పిల్లలు ఇంజినీరింగ్ చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రులు ఆలోచన చేస్తుంటారన్నారు. అయితే ఇంజినీరింగ్ పూర్తి చేస్తేనే వారి ఆశలు నెరవేరవన్నారు. వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకుని దానికి తమ మేధస్సును, నైపుణ్యాలను జోడించినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకుంటారన్నారు. అలాంటి నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ, అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానం కేఎల్ యూనివర్సిటీ సొంతమన్నారు. విద్యార్థులకు బాసటగా నిలిచే వర్సిటీలోని కోర్సులను ఎంపిక చేసుకుని భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. పలువురు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇంటర్ తర్వాత ఏ కోర్సులు చేయాలి?, ఎక్కడ చదవాలి? అని తెలియక సరైన నిర్ణయం తీసుకోలేరని, అలాంటి వారికి దిశ, నిర్దేశం చేసేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వర్సిటీలో ప్రత్యేక శిక్షణ పొందిన వేలాదిమంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గి పలు కంపెనీల్లో రూ.లక్షల్లో జీతాలొచ్చే ఉద్యోగాలు సాధించారన్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు సాధించేలా స్కిల్స్‌ను విద్యార్థులకు శిక్షణలో నేర్పుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ హెడ్ బి.శివరామకృష్ణ, వర్సిటీ రీజనల్ మేనేజర్ కె.రాంబాబు, మేనేజర్ ఆర్.శేఖర్‌బాబు, కళ్యాణ్, రజిత, ఏఎస్ఆర్ కళాశాల నిర్వాహకులు సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం నోటి వెంకటేశ్వరరెడ్డి, పలు కళాశాలల ఇంటర్, డిగ్రీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన వచ్చింది



కేఎల్ యూనివర్సిటీ నిర్వహించిన సమావేశంలో ఎలాంటి కోర్సులు చేయాలి?, దాని ప్రయోజనాలు తదితర అంశాలపై పూర్తిస్థాయి అవగాహన వచ్చింది. మంచి అధ్యాపకులు, ఇంటి వాతావరణం ఉన్న కేఎల్ యూనివర్సిటీ లాంటి చోటే భవిష్యత్‌కు పునాది ఉంటుందని అర్థమైంది.

– సీహెచ్ సూర్య, విద్యార్థి, ఆత్మకూరు

సబ్జెక్ట్‌ల ఎంపికకు అవకాశం కలిగింది



సమావేశంలో పాల్గొనడం ద్వారా సబ్జెక్ట్‌ల ఎంపిక గురించి బాగా అవగాహన కలిగింది. భవిష్యత్‌లో ఉద్యోగాలకు తగినట్లుగా నైపుణ్యం సాధించేందుకు ఎలాంటి కోర్సులు ఎంచుకోవాలో తెలిసింది. ఈ సమావేశానికి రావడం అదృష్టంగా భావిస్తున్నా.

– ఎస్.దీప్తి, విద్యార్థిని, ఆత్మకూరు

భవిష్యత్‌లో ఏమి చేయాలో తెలిసింది



ఇంజినీర్ అవుదామనుకున్నా. పోటీ ప్రపంచంలో ఎలా అని మదనపడుతుండేదాన్ని. సమావేశంలో పాల్గొనడంతో ఏ కోర్సు చేస్తే ఎలాంటి అవకాశాలు దక్కుతాయన్న దానిపై అవగాహన కలిగింది. విద్యార్థులకు ఇలాంటి సమావేశాలు ఎంతో ఉపయోగం.

– బి.మాధవి రెడ్డి, విద్యార్థిని, ఆత్మకూరు

ప్రజాసేవకు ఎస్పీ అర్హుడు కాదు

- టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అజీజ్

నెల్లూరు(టౌన్): ఎస్పీ విజయారావు ప్రజాసేవకు అర్హుడు కాదని టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేను చూసుకుని పోలీసు వ్యవస్థ తీవ్రంగా రెచ్చిపోతోందన్నారు. ఎన్నో పాపాలు చేసిన ఎస్పీని కాపాడటం ఎవరి తరం కాదన్నారు. మాతంగి కృష్ణ, అల్లాభక్షు కేసుల విషయంలో చార్జిషీట్ ఫైల్ చేసి చర్యలు తీసుకోకపోతే ఎస్పీ కార్యాలయం వద్ద బైఠాయించడంతోపాటు దాడి చేస్తామని హెచ్చరించారు. టీడీపీలో ఎవరు చేరతారన్న విషయం చంద్రబాబు, లోకేష్ చూసుకుంటారన్నారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలుగుదేశంలోకి వస్తారన్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

పోలీసులపై అనుచిత వ్యాఖ్యలను సహించం

- ఏపీ పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్‌రావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఏపీ పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు హెచ్చరించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ (టీడీపీ నాయకుడు అబ్దుల్ అజీజ్‌ను ఉద్దేశించి) కొంతమంది రాజకీయ నాయకులు వారి ఉనికి కాపాడుకునేందుకు పోలీసు వ్యవస్థపై ఇష్టానుసారంగా మాట్లాడటం దారుణమన్నారు. కించపరిచే భాషను మరోసారి ఉపయోగిస్తే తీవ్రంగా ప్రతిగణించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వెంటనే పోలీసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కోవిడ్ కష్టకాలంలో, వరదల సమయంలో ఎస్పీ విజయారావు ఏ విధంగా కష్టపడ్డారో అందరికీ తెలుసన్నారు. ఆ సమయంలో తలుపులు వేసుకుని ఇంట్లో పడుకున్న సోగ్గాళ్లు నేడు ఎస్పీపై అనుచిత వ్యాఖ్యలు చేయటం మంచి పద్ధతి కాదన్నారు. ఐపీఎస్ అధికారిని ఇష్టానుసారం మాట్లాడటం సిగ్గుచేటని, ఎస్పీగా విజయారావు పలు అవార్డులు తీసుకున్నారన్నారు. ఎన్నో క్లిష్టమైన కేసులను పరిష్కరించారన్నారు. ప్రతి సోమవారం పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఎస్పీకి, పోలీసుల అధికారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మార్చి 13 నుంచి 'సింహపురి' వేగం పెంపు

నెల్లూరు(సెంట్రల్): గూడూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే (12709) సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు వేగాన్ని మార్చి 13వ తేదీ నుంచి పెంచుతున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సికింద్రాబాద్ నుంచి గూడూరు వచ్చే (12710) రైలు వేగాన్ని పెంచుతున్నామన్నారు.

ప్రతిరోజూ మెమూ

విజయవాడ-బిట్రగుంట (07978) మెమూ నేటి నుంచి ప్రతిరోజూ నడుస్తుందని, అదేవిధంగా బిట్రగుంట-విజయవాడ (07977) మెము రైలు కూడా ప్రతిరోజూ నడుస్తుందని రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు గమనించాలని తెలియజేశారు.

గుండెపోటుతో కందుకూరు డిప్యూటీ డీఈఓ మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

కొండపి: కందుకూరు డిప్యూటీ డీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.వెంకటేశ్వర్లు (59) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబంతో కలిసి కొండపిలో నివాసం ఉంటున్న ఆయన అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు వెంటనే స్పందించి పొదిలి రోడ్డులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేశ్వర్లు మద్రిపూడి మండలం తంగెళ్ల హైస్కూల్లో హెచ్‌ఎంగా విధులు పని చేస్తూనే డిప్యూటీ డీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భార్య మంజులాదేవితోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రస్తుతం అమెరికాలో ఎంఎస్ చేస్తున్నారు. ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామమైన పల్నాడు జిల్లా ముప్పాళ్ల గ్రామం తరలించారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు మంగళవారం ముప్పాళ్ల వెళ్లి నివాళులర్పించారు. మూడు దశాబ్దాలకుపైగా ఉపాధ్యాయుడిగా, ఎంఈఓగా, డిప్యూటీ డీఈఓగా వెంకటేశ్వర్లు సేవలందించారు.

జాతీయ రహదారిపై ఆటో బోల్తా


- ఆరుగురికి గాయాలు



గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న 108 సిబ్బంది

కొడవలూరు: ఆటో బోల్తా పడి ఆరుగురు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని రేగడిచెలిక వద్ద హైవేపై మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడుకు చెందిన 11 మంది ఆటోలో కావలి అడవిపాలెంలోని ఆలయానికి వెళ్లారు. పూజా కార్యక్రమాలు అయ్యాక తిరిగి అదే ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. ఈక్రమంలో రేగడిచెలిక ఫ్లై ఓవర్ వద్ద డ్రైవర్ ఆటో సడన్ బ్రేక్ వేయడంతో స్కిడ్ అయ్యి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు, సురేష్, విజయమ్మ, కె.రాజు, కామాక్షి, కొండయ్యకు గాయాలయ్యాయి. వారంతా రక్త సంబంధీకులేనని బంధువులు తెలిపారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్, 108 వాహనాల్లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు సమాచారం అందించారు.

ఎఫ్‌సీఐ ఉద్యోగి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)లో క్లర్క్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. విశాఖపట్నంకు చెందిన కంభంపాటి రవీంద్ర (48) అనే వ్యక్తి ఎఫ్‌సీఐలో పనిచేస్తూ, రెండునెలల క్రితం బదిలీపై నెల్లూరుకు వచ్చాడు. నెల్లూరులోని బృందావనం వద్ద ఉన్న ఎఫ్‌సీఐ కార్యాలయంలో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తూ, సమీపంలోనే గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. రవీంద్ర రోజూ కార్యాలయానికి ఉదయం 9.30కు వెళ్లి తిరిగి సాయంత్రం ఆరు గంటలకు గదికి వస్తుండేవాడు. కాగా రెండురోజుల నుంచి రవీంద్ర కనిపించకపోవడంతో ఇంటి యజమాని వెంకటరత్నం మంగళవారం గది వద్దకు వెళ్లాడు. గడియ పెట్టి ఉండటం, గది నుంచి దుర్వాసన వస్తుండటంతో కిటికీలో నుంచి చూశాడు. మంచంపై రవీంద్ర మృతి చెంది ఉండటాన్ని గుర్తించి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ఘటనా స్థలానికి చేరుకుని గది తలుపులు పగులకొట్టి మృతదేహాన్ని పరిశీలించారు. అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. అయితే రవీంద్ర ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.